ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
సోమవారం 12 ఫిబ్రవరి 2024



స్థల యజమానిపై కబ్జాదారుల దాడి

రాయచూరు, ఫిబ్రవరి 11 : జిల్లాలోని మాన్వి తాలూకా మద్లాపురలో ఖాళీ స్థలం ఆక్రమణకు సంబంధించి యజమానిపైనే కబ్జాదారులు దాడికి దిగారు. మద్లాపుర గ్రామంలో నివసించే మల్లికార్జునకు చెందిన స్థలం వారి తండ్రి పేరున ఉండగా కొంత మంది కబ్జాదారులు ఆక్రమించారు. దీనిపై శనివారం రాత్రి ప్రశ్నించిన మల్లికార్జునను దుర్భాషలాడిన కబ్జాదారులు ఏకంగా ఇనుపరాడ్లు, చాకులు, క్రికెట్ బ్యాట్లతో 15 మంది గుంపుగా వచ్చి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో మల్లికార్జున్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కొంతమంది గాయపడగా బాధితులు వెంటనే మాన్వి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి సభా సమరం

- ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 16న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న సీఎం
- విధానపరిషత్‌లోనూ ఫొటో, వీడియోగ్రాఫర్లకు నిషేధం



బడ్జెట్‌పై వివిధ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో సీఎం సమావేశం

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ రాజకీయాలు వేడెక్కిన తరుణంలో శాసనసభ సమావేశాలు అధికార, ప్రతిపక్షాలు తమ పట్టును చాటేందుకు సిద్ధమవుతున్నాయి. శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. బెళగావిలో శీతాకాల సమావేశాలు ముగిశాక కలాపాలు సాగుతున్న తరుణమిది. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత కలాపాలు కొనసాగుతాయి. గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వ లక్ష్యం, దశ, దిశతోపాటు ప్రగతిని వివరిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర బడ్జెట్ ఈనెల 16న శుక్రవారం ఆర్థికమంత్రి హోదాలో సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టనున్నారు. ఉపముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి హోదాలో ఇప్పటి వరకు 14 బడ్జెట్‌లను ప్రవేశపెట్టిన సిద్దరామయ్య 15వ బడ్జెట్‌కు సిద్ధమయ్యారు. రాష్ట్ర చరిత్రలో అత్యధికసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు కూడా సిద్దరామయ్యదే. గతంలో ఆర్థికమంత్రి హోదాలో మాజీ సీఎం రామకృష్ణ హెగ్డే 13సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ రికార్డును ఇప్పటికే సిద్దరామయ్య అధిగమించారు. శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలో నిరసనలు, ఆందోళనకు అవకాశం లేకుండా 144 సెక్షన్ విధించారు. విధానసౌధ పరిసర ప్రాంతాలలో ఆంక్షలు అమలులో ఉంటాయి. శాసనసభ కలాపాలు కొనసాగే 15 రోజులపాటు నిబంధనలు అమలులో ఉంటాయని పోలీసుశాఖ ప్రకటించింది. అసెంబ్లీ సమావేశాల్లో ఫొటోగ్రాఫర్, ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి వీడియోగ్రాఫర్లకు చిత్రీకరణకు నిషేధం అమలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే విధానపరిషత్‌లో మాత్రం ఎటువంటి అంతరాయం లేకుండా చానళ్లు చిత్రీకరణ కొనసాగించేవి. అసెంబ్లీ తరహాలోనే పరిషత్‌లోనూ తాజాగా ఆంక్షలు విధించారు. దీన్నిబట్టి పరిషత్ గ్యాలరీలలో కేవలం సందర్శకులు మాత్రమే ఉంటారు. ఉభయసభలకు సంబంధించి దూరదర్శన్ మాత్రమే ప్రసారం చేయనుంది.

కేంద్రంపై రగిలిపోతున్న కాంగ్రెస్

రాష్ట్రానికి సంబంధించి పన్నుల వాటా, గ్రాంట్లు, కరువు సాయం అందించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అధికార కాంగ్రెస్ రగిలిపోతోంది. తాజాగా కేంద్రప్రభుత్వ ధోరణిపై ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. స్వయంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ సహా మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు జంతర్‌మంతర్‌లో ఆందోళన చేశారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున కొనసాగిన ఆందోళన దేశవ్యాప్తంగా చర్చకు కారణమైంది. ఈ అంశంపై శాసనసభలోనూ తీవ్రమైన చర్చకు అధికార పార్టీ లేవనెత్తేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. కాగా బడ్జెట్ రూపకల్పనపై అపార అనుభవం కల్గిన సీఎం సిద్దరామయ్య దాదాపు నెలరోజులుగా కసరత్తు చేస్తున్నారు. తాజాగా ఆదివారం రైతు సంఘం ప్రతినిధులు, వాణిజ్య సంఘాలు, రవాణా సంస్థలు, అబ్కారీ, దళిత, కార్మిక సంఘాల ముఖ్యులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను ఆలకిస్తూనే బడ్జెట్‌లో ఏ విధంగా కేటాయింపులు కొనసాగించాలనే అంశంపై కూడా చర్చించారు. మూడు వారాలకు పైగా సీఎం దాదాపు అన్ని శాఖలతో బడ్జెట్‌పై చర్చలు జరిపారు.

40 శాతం కమీషన్‌పై నిలదీసేందుకు బీజేపీ సిద్ధం

బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు 40 శాతం కమీషన్ అంశంపై కాంగ్రెస్ భారీ స్థాయిలో ప్రచారం చేసింది. రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు కెంపణ్ణ ఆరోపణలపై అప్పట్లో బీజేపీ పాలకులను అవినీతిపరులుగా చూపేందుకు కాంగ్రెస్ వర్గాలు తీవ్రస్థాయిలో ప్రచారం చేశాయి. ప్రస్తుతం అదే కెంపణ్ణ కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారుల ద్వారా 40 శాతం కమీషన్‌ను తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ అంశంపై బీజేపీ నేతలు శాసనసభలో నిలదీసేందుకు సిద్ధమయ్యారు. బీజేపీ, జేడీఎస్ పార్టీల మైత్రిపై స్పష్టత వచ్చాక జరుగుతున్న శాసనసభ సమావేశాలు కావడంతో ఉమ్మడిగా అధికార కాంగ్రెస్‌ను నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ ప్రత్యేక దేశం అంశం ప్రస్తావించడం, అందుకు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు వత్తాసు పలికేలా మాట్లాడడంపైనా బీజేపీ నేతలు సభలో చర్చకు డిమాండ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఎక్కువ స్థానాలు గెలవాల్సిందే

- పార్టీ నేతలకు అమిత్‌షా దిశానిర్దేశం
- సుత్తూరు మఠం సందర్శన

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో గెలవాల్సిందేనని, ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సూచించారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం మైసూరులోని ఓ హోటల్‌లో బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 28 లోక్‌సభ స్థానాల్లో విజయానికి అనుసరించాల్సిన అంశాలపై చర్చించారు. నియోజకవర్గాల వారీగా సమీక్ష జరిపారు. రాష్ట్ర నేతలకు కొన్ని సలహాలు ఇస్తూనే దిశానిర్దేశం చేశారు. జేడీఎస్‌తో పొత్తు ఉంటుందని, వారికి కేటాయించే సీట్లలోనూ కష్టపడి పనిచేయాలని సూచించారు. జేడీఎస్‌కు ఏ సీట్లు కేటాయించాలనే అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్రంలో ప్రస్తుతం 25 మంది పార్టీ ఎంపీలు ఉన్నారని, వారిలో మార్పులు చేయాల్సిన అనివార్యతపై ఆరా తీశారు. కొంతకాలంగా స్తబ్దుగా ఉండేవారు ఎవరని వివరాలు అడిగి తెలుసుకున్నారు. టిక్కెట్ల విషయంలో బహిరంగ వ్యాఖ్యలు వద్దని సూచించారు. కేంద్రంలో మరోసారి నరేంద్రమోదీని ప్రధానమంత్రిగా చేయాలని, బీజేపీని గెలిపించాలని ప్రజలు ఉత్సాహంతో ఉన్నారని తెలిపారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేయరాదని, అంతర్గత కుమ్ములాటలకు అవకాశం ఇవ్వరాదని, ఎన్నికల వేళ ఆచితూచి వ్యవహరించాలని సూచించారు. కోర్ కమిటీ తర్వాత మైసూరు ప్రాంత క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించారు. మైసూరు, కొడగు, హాసన్, మండ్య, చామరాజనగర నియోజకవర్గాల పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పనితీరు, అభ్యర్థి విషయమై చర్చించారు. మైత్రి ద్వారా కలసి వస్తుందని ఆ దిశగా జేడీఎస్ నాయకులతో కలసి పనిచేయాలని సూచించారు.

చాముండేశ్వరిని దర్శించుకున్న షా

మైసూరు పవిత్రపుణ్యక్షేత్రం, నాడదేవత చాముండేశ్వరి దేవిని అమిత్‌షా దర్శించుకున్నారు. అమిత్‌షాకు అర్చక బృందం పూర్ణకుంభంతో స్వాగతించారు. ఆలయంలోకి ప్రవేశించిన అమిత్‌షా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శశిశేఖర దీక్షిత్ ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి.

సుత్తూరు మఠం సేవలు ప్రశంసనీయం

సుత్తూరు మఠం తరఫున దశాబ్దాల కాలంగా విద్యాభివృద్ధితో పాటు సమాజసేవకు ప్రాధాన్యత ఇస్తున్నారని



రామ్‌లల్లా శిల్పి అరుణ్ యోగిరాజ్‌ను సత్కరిస్తున్న కేంద్ర మంత్రి అమిత్‌షా

శివరాత్రి దేశికేంద్ర స్వామిజీ సేవలు ప్రశంసనీయమని కేంద్రమంత్రి అమిత్‌షా కొనియాడారు. ఉదయం సుత్తూరు మఠాన్ని సందర్శించారు. మఠంలో శివరాత్రీశ్వర శివయోగి సమాధికి పూజలు నిర్వహించారు. శివరాత్రీశ్వర శివయోగి జాతర మహోత్సవంలో భాగస్వామ్యులయ్యారు. కాంగ్రెస్ నేత శ్యామనూరు శివశంకరప్ప నిర్మించిన అతిథిగృహాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ ప్రస్తుత శివరాత్రి దేశికేంద్రస్వామిజీ దాకా 24 మంది సుత్తూరు మఠాధిపతులు నిస్వార్థంగా సేవ చేశారని, విద్యాభివృద్ధికి వారి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. జగజ్యోతి బసవణ్ణను స్మరించుకోవాలన్నారు. బసవణ్ణ ఓ వర్గానికి పరిమితం కాలేదని, వచనాల ద్వారా దేశమంతటా చైతన్యం తెచ్చారని తెలిపారు. జేఎస్ఎస్‌కు అనుబంధంగా 350కుపైగా సంస్థలు ఉన్నాయని, లక్షమంది విద్యార్థులకు గుణాత్మక విద్య లభించడం సంతోషమన్నారు. దివ్యాంగులకు పాలిటెక్నిక్ కోర్సులు ఉండడం సంతోషదాయకమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారతీయ సంస్కృతికి పూర్వవైభవం తీసుకొస్తున్నారని చెప్పారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తి అయిందన్నారు. కాశీ విశ్వనాథ, మహాబళేశ్వర కారిడార్‌లు స్థాపించామన్నారు. ఇదే సందర్భంగా అయోధ్యలో ప్రతిష్ఠించిన రామ్‌లల్లా విగ్రహ శిల్పి అరుణ్ యోగిరాజ్‌ను ఆత్మీయంగా సత్కరించారు. శివరాత్రి దేశికేంద్ర స్వామిజీ మాట్లాడుతూ భారతీయ గ్రామీణ సంస్కృతికి పునరుజ్జీవనం తీసుకురావాలనే జాతర జరుపుతున్నామని పేర్కొన్నారు. దేశంలో ఐక్యత, సమగ్రత దృష్టితో కేంద్రం తీసుకున్న నిర్ణయాలను స్వామిజీ ప్రశంసించారు. అమిత్‌షా శక్తివంతమైనవారన్నారు. మైసూరు ప్యాలెస్ విద్వాంసులు కేశవపండిత్ ద్వారా అమిత్ షా శిక్షణ పొందారని, ఇలా మైసూరుకు, అమిత్‌షాకు సంబంధం ఉందని కొనియాడారు. ప్రధాని మోదీ, అమిత్‌షా జోడెద్దుల తరహాలో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. భారత సంస్కృతిని చాటేలా శిల్పి యోగిరాజ్ రూపొందించిన రామ్‌లల్లా విగ్రహం ఉందని కొనియాడారు. యోగిరాజ్ ఇక్కడి విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. అమిత్‌షాతోపాటు కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, ప్రతిపక్షనేత ఆర్.అశోక్, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, మైసూరు ఎంపీ ప్రతాప్‌సింహ, పార్టీ నేత సీటీ రవి, బెళగావి కేఎల్‌ఈ విద్యాసంస్థల కార్యాధ్యక్షుడు ప్రభాకర్ కోరె సహా పలువురు పాల్గొన్నారు.

మండ్య నుంచి పోటీ చేయను

- సుమలత అభ్యర్థి కావడం కాలమే నిర్ణయిస్తుంది : నిఖిల్

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండ్య నుంచి పోటీ చేయబోనని గతంలోనే బహిరంగంగానే చెప్పానని, మరోమారు అదే నిర్ణయమని జేడీఎస్ యువ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి వెల్లడించారు. బెంగళూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఏ విషయంలోనూ యూటర్న్ తీసుకునే వ్యక్తిని కాదన్నారు. 2019లో పోటీ చేసి ఓడానని, ఇప్పటికీ మండ్య నుంచి పోటీ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. మండ్యకు చెందిన నాయకులు తనను పోటీ చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. వీరి ఒత్తిడితోనే మండ్య ప్రాంతంలో పర్యటించానని వివరించారు. మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. 28 నియోజకవర్గాల్లోనూ పర్యటిస్తానని చెప్పారు. మండ్య నుంచి సుమలతకు టిక్కెట్ ఇస్తారా అనే ప్రశ్నకు కాలమే నిర్ణయిస్తుందని బదులిచ్చారు. తన తండ్రి కుమారస్వామి కొంత ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నందున మైసూరులో కేంద్ర మంత్రి అమిత్‌షాను స్వాగతించేందుకు వెళ్తున్నానని తెలిపారు. కుమారస్వామి శాసనసభ సమావేశాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పన్నుల వాటాలో వ్యత్యాసంపై సమాధానం చెప్పాలని కేంద్రమంత్రి అమిత్‌షాను కాంగ్రెస్ కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైనాన్స్ కమిషన్లు స్వయం ప్రతిపత్తి సంస్థలని, వెనుకబడిన రాష్ట్రాలకు ఎక్కువ నిధులు పోతాయన్నారు. కమిషన్ సిఫారసుల మేరకే కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు.



మీడియాతో నిఖిల్

శ్రీమంతులకు రుణమాఫీ సముచితమేనా..?

- రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ



బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో కొందరు శ్రీమంతులకు చెందిన రూ. 1.75 లక్షల కోట్లు బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం రుణమాఫీ చేసిందని ఇది సముచితమేనా అని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ ప్రశ్నించారు. ఆదివారం విధానసౌధలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీలను ఉచితభాగ్యలంటూ బీజేపీ నాయకుల విమర్శలపై ఆయన స్పందించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోనే ప్రముఖ శ్రీమంతులుగా గుర్తింపు పొందిన అంబానీ, అదానీ వంటి కొంతమందికి చెందిన రుణ బకాయిలను మాఫీ చేసిందని ఇది ఉచితం కాదా..? అంటూ ప్రశ్నించారు. శ్రీమంతులకు రుణమాఫీ చేసి పేదల నుంచి కొత్త పన్నుల రూపంలో వసూలు చేయడం లేదా..? అని మండిపడ్డారు. పేదలకు సంక్షేమాలు అందరాదనే బీజేపీ నాయకులు గ్యారెంటీలను విమర్శిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో గ్యారెంటీలను విమర్శించే బీజేపీ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పలు రాష్ట్రాలలో పలు గ్యారెంటీలను మేనిఫెస్టోలో చేర్చారని విమర్శించారు.

రాష్ట్రంలోనే అమిత్‌షా పరిహారం ప్రకటించాలి

రాష్ట్ర పర్యటనలో ఉన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఇక్కడి నుంచే రాష్ట్రానికి కరువు పరిహారం ప్రకటించాలని కృష్ణబైరేగౌడ డిమాండ్ చేశారు. రాష్ట్ర పర్యటనలో కరువు పరిహారం ప్రకటిస్తే అభినందిస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాల కంటే రెండు నెలల ముందే కరువు నివేదికను కేంద్రానికి పంపామని వివరించారు. 223 తాలూకాలలో కరువు నెలకొందని, రూ. 870 కోట్లు రాష్ట్రం నుంచి జిల్లా అధికారులు, తహసీల్దార్‌ల ఖాతాలకు అత్యవసర సేవలకోసం బదిలీ చేశామని పేర్కొన్నారు. 156 గ్రామాలకు తాగునీటిని ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేశామని, 46 గ్రామాలకు 60 ట్యాంకర్ల ద్వారా తాగునీరు ఇస్తున్నామని చెప్పారు. 33 లక్షల మంది రైతులకు రూ.2వేలు చొప్పున రూ.628 కోట్లు జమ చేశామని తెలిపారు.



ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఇంటి వద్ద ఈడీ అధికారులు

రెండో రోజూ కొనసాగిన ఈడీ సోదాలు

బళ్లారి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి కార్యాలయంలో రెండో రోజు ఆదివారం కూడా ఈడీ సోదాలు కొనసాగాయి. ఇల్లు, కార్యాలయాలపై దాడులలో 40 మంది అధికారుల బృందం శనివారం కార్యాచరణలో పాల్గొన్న సంగతి విదితమే. ఆదివారం ఎక్కువసేపు ఎమ్మెల్యే ఇంట్లోనే సోదాలు కొనసాగించారు.

మల్లన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలం, ఫిబ్రవరి 11: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం రాత్రి కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇందిరేష్ దర్శించుకున్నారు. రాజగోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జడ్జికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ ఇందిరేష్

రాజ్యసభ బీజేపీ అభ్యర్థిగా నారాయణ కృష్ణనాస్ భాండగె

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రం నుంచి బీజేపీ హైకమాండ్ ఆశ్చర్యకరంగా సరికొత్త అభ్యర్థిని ప్రకటించింది. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించిన నారాయణ కృష్ణనాస్ భాండగెకు టిక్కెట్‌ను ఆదివారం ప్రకటించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర అధిష్ఠానం నాయకులతో భేటీ అనంతరం అభ్యర్థి పేరు ప్రకటించారు. రాజ్యసభ అభ్యర్థి టికెట్ ఆశిస్తున్నవారిలో కేంద్ర మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్, మాజీ మంత్రి సోమణ్ణ ఉండగా అనూహ్యంగా నారాయణ కృష్ణనాస్ భాండగెకు టిక్కెట్ ఇస్తూ ప్రకటించడంపై పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశమైంది.




పరస్పర సహకారంతోనే సమాజ అభివృద్ధి

- ఐటీ నిపుణుల సమావేశంలో ఏడీజీపీ చంద్రశేఖర్

మహదేవపుర, ఫిబ్రవరి 11: పరస్పర సహకారంతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అడిషనల్ డీజీపీ (ఇంటర్నల్ సెక్యూరిటీ) ముప్పా చంద్రశేఖర్ తెలిపారు. మారతహళ్లి సమీపంలోని న్యూ హారిజన్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం కాకతీయ కమ్మసేవా సమితి వ్యవస్థాపకుడు రామారావు గంగవరపు, అధ్యక్షుడు దిలీప్ నేతృత్వంలో సాఫ్ట్‌వేర్ నిపుణుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగులకు కాకతీయ కమ్మసేవా సమితి ఉద్యోగాలు ఇప్పించడంలో చూపిన చొరవ అభినందనీయమన్నారు. కర్మభూమిని గౌరవించాలని, మాతృభాషని, మాతృభూమిని విస్మరించరాదని పేర్కొన్నారు. రామారావు మాట్లాడుతూ 2007లో ఉద్యోగం కోసం తనకు సాయం చేసేవారు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని, అందుకే ఇతరులు ఆ సమస్య ఎదుర్కొకుండా తనవంతుగా చేయూత ఇచ్చేందుకు కాకతీయ కమ్మసేవా సమితిని స్థాపించినట్టు తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల చదువుకు తగిన సాయం, ప్రభుత్వ తెలుగు పాఠశాలలకు పుస్తకాలు సమకూర్చడం వంటి కార్యక్రమాలను సంస్థ కొనసాగిస్తోందన్నారు. దిలీప్ మాట్లాడుతూ సమాజానికి బలంగా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. చార్టెర్డ్ అకౌంటెంట్ అనుమోలు బాలమురళీకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల తరహాలో కుల సంఘాలు కూడా తమ సేవలను విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి యువతీ యువకులలో ఎక్కువ మంది కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడంతోనే సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించలేకపోతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసే నాయకుడికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఏస్‌సాఫ్ట్ ల్యాబ్స్ సంస్థ సీఈఓ రేణుక వెలమటి మాట్లాడుతూ ప్రతి కుల సంఘం ఆయా సామాజికవర్గంలో ఆర్థికంగా వెనుకబడినవారికి చేయూతనిస్తూ ఇతర సముదాయాలవారిని కూడా ఆదరించాలన్నారు. ది బెంగళూరు సౌత్ సెంటర్ అధ్యక్షుడు రవీంద్రనాథ్‌నాయుడు మాట్లాడుతూ ఐటీ రంగంలో బెంగళూరు నగరానికి ప్రపంచఖ్యాతి ఉందని, సాంకేతిక నిపుణులు మరింత ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. సుమారు రెండువేల మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు పాల్గొన్నారు. సమితి పదాధికారులు చైతన్య మాదాల, శ్రీనివాస్ ముమ్మనేని, వేణు మోతుకూరి, సుధీర్ కొన్నేరు, ప్రదీప్ సాదు, మణినాయుడు పాల్గొన్నారు.



ఏడీజీపీ ముప్పా చంద్రశేఖర్‌కు సన్మానం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.00	1,612.58
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	92	9,424
సామర్థ్యం (టీఎంసీలు)	9.44	42.92

మహనీయుల జయంతితో మనిషిలో మార్పు



మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పించిన తహసీల్దార్

సిరుగుప్ప, ఫిబ్రవరి 11 : శరణుల లాంటి మహనీయుల జయంతిని జరుపుకోవడం వలన మనిషిలో మార్పు వస్తుందని తహసీల్దార్ షంషాలం అభిప్రాయపడ్డారు. సిరుగుప్ప తహసీల్దార్ కార్యాలయంలో వేదార్ చెన్నయ్య, అరళయ్య, గుర్లింగ పెద్ది జయంతిల సందర్భంగా ఆదివారం వారి భావ చిత్రపటాలకు పూలమాలలు వేసి జయంతిని నిర్వహించారు. మహనీయులు రచించిన తత్వ సిద్ధాంతాలను పాటిస్తే మనిషికి శాంతి, చేకూరుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర, సిద్ధార్థ, రెవెన్యూ అధికారులు, విలేజ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

పథకాల సద్వినియోగం ముఖ్యం



మాట్లాడుతున్నవీధి వ్యాపారస్తులు శిక్షణ అధికారి ప్రాణేష్

సిరుగుప్ప, ఫిబ్రవరి 11 : వీధి వ్యాపారస్తులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వీధి వ్యాపారస్తుల శిక్షణ అధికారి ప్రాణేష్ తెలిపారు. సిరుగుప్ప నగర సభ ఆధ్వర్యంలో వీధి వ్యాపారస్తులకు ఎనిమిది అభివృద్ధి పథకాలు అమలుజేయడంపై మార్కెట్ యార్డులో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రాణేష్ మాట్లాడుతూ వీధి వ్యాపారస్తులకు కేంద్ర ప్రభుత్వం మొదటి విడత రూ. పది వేలు, రెండవ విడత రూ. 20 వేలు, మూడవ విడత రూ. 50 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ నగరంలో ఈ పథకం కింద వెయ్యి మంది లబ్ది పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు మేనేజర్ మోహన్ రెడ్డి, నగరసభ సముదాయ అధికారి అమరేష, సూపర్‌వైజర్లు ఉమామహేశ్వరి, కావ్య, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది, నగర ప్రజలు, వీధి వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఐదు హామీలు లోక్‌సభ ఫలితాలకు గ్యారెంటీ



సమావేశంలో సంతోష్‌లాడ్ తదితరులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో అమలు చేసిన ఐదు హామీలను లోక్‌సభ ఎన్నికల తర్వాత రద్దు చేస్తామన్నది అబద్దమని, ఈ లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ఈ పథకాలే హామీ అని కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ అన్నారు. నగరంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలస్థాయిలో కూడా ప్రజలకు హామీ పథకాలను తెలియచేయాలన్నారు. ఎన్నికలకు ప్రత్యేక సన్నద్ధత ఏమీ లేదని, మిగిలిన వారికి ఎన్నికల వ్యూహం ఉంటుందని చెప్పారు. బళ్లారి నియోజకవర్గానికి అభ్యర్థులు చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని, ఉగ్రప్ప కూడా స్థాని కుడే అనుకోవాలన్నారు. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్‌కే పట్టం కడతారని మంత్రులు నాగేంద్ర, జమీర్ అహ్మద్ తెలిపారు. ఎన్నికల్లో అభివృద్ధి అంశాలు ముఖ్యం కాదని, రామమందిరాన్ని తామే(బీజేపీ) నిర్మించినట్లు వ్యవహ రిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని తాలిబన్లతో పోల్చిన ప్రహ్లాద్ జోషి వైఖరి బాధాకరమన్నారు. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యుడు కెఎల్.స్వామి, మేయర్ శ్వేత, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌రఫిక్, వెంకటేశ్ ప్రసాద్, మానయ్య, జగన్నాథం, సరగు నాగరాజు, శివరాజ్‌హెగ్డే, కార్పోరేషన్ సభ్యులు గాదెప్ప, కేబేరా తదితరులు పాల్గొన్నారు.

కూలిన బస్సు షెల్టర్ : ఇబ్బందుల్లో ప్రజలు

● నేలకూలిన షెల్టర్‌తో లక్షలాది రూపాయలు వృథా ● పునర్నిర్మాణానికి ప్రజల డిమాండ్

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 11: నగరంలోని మోకారోడ్డు కెఇబి సర్కిల్‌లో ఈ నెల ఒకటవ తేదీన బస్సు షెల్టర్ కూలిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దానిని తిరిగి నిర్మించాలని కోరుతున్నారు. భారీలోడ్ కలిగిన వాహనాలు నగరంలోకి ప్రవేశించరాదనే ఉద్దేశ్యంతో సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కెఇబి సర్కిల్ వద్ద ఇటీవల



నేలకూలిన బస్సు షెల్టర్...

హైట్ బ్యారికేడ్ ఏర్పాటు చేశారు. అలా ఏర్పాటు చేసిన కొన్ని గంటల్లోనే కంకరలోడ్‌తో వచ్చిన టిప్పర్ ఆ బ్యారికేడ్‌ను బలంగా ఢీ కొనడంతో అది ప్రక్కనే ఉన్న బస్సు షెల్టర్‌పైపడి అది కూలిపోయింది. కార్పొరేషన్ అధికారులు అశాస్త్రీయంగా ఏర్పాటుచేసిన హైట్ బ్యారికేడ్ కొన్ని గంటల్లో కూలిపోవడం అధికారుల తప్పిదానికి పరాకాష్టగా మిగిలిందని చెప్పవచ్చు. మూడేళ్ళ క్రితం అప్పటి బుడా అధ్యక్షులు దమ్మూరు శేఖర్ స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారుల భాగస్వామ్యంతో నగరంలో పలుచోట్ల బస్సు షెల్టర్లు నిర్మించారు. అందులో భాగంగా కెఎబి సర్కిల్‌లో కూడా షెల్టర్ నిర్మించారు. ఇది మోకా వైపు వెళ్ళే రాష్ట్ర రహదారి కావడంతో కర్నూలు, హైదరాబాద్ వైపు వెళ్ళే వాహనాలు ఇదే రోడ్డు గుండా వెళ్ళాల్సి ఉంటుంది. ఈ బస్సుషెల్టర్‌లో నిత్యం బస్సుల కోసం ప్రయాణికులు వేచిచూస్తుంటారు ఇది పూర్తిగా కూలిపోయినా అధికారులు ఎవరూ దాని గురించి పట్టించుకోవడంలేదు. నగరంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సహకారంతో నిర్మించినది కావడంతో... కూలిన బస్సు షెల్టర్ పునరుద్ధరణపై ఇటు కార్పొరేషన్ అధికారులుగాని, అటు బుడా అధికారులు దృష్టి సారించడం లేదు. ఎవరిని అడిగినా... తమకు సంబంధించిన ప్రాపర్టీ కాదనే సమాధానం ఇస్తున్నారు. ఏదిఏమైనా ప్రజలకు అవసరమయ్యే బస్టాపును పున రుద్దరించాల్సిన బాధ్యత కార్పొరేషన్ అధికారులపై ఉందని, కూలిన బస్టాపు స్థానంలో కొత్తది నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇందిరా క్యాంటీన్ల పునఃప్రారంభం

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 11: ఆకలిగొన్న వారికి వరదాయినిగా మారిన ఇందిరా క్యాంటీన్లు తిరిగి తెరుచుకోవడంతో కార్మికులు, పేద విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆకలిగొన్న వారి ఆకలి తీర్చే ఇందిరాక్యాంటీన్లు గత 20 రోజులుగా మూతబడిన విషయం విదితమే. దీనిపై జనవరి 31న ఆంధ్రజ్యోతిలో 'మూతబడిన ఇందిరా క్యాంటిన్‌లు' అనే శీర్షికతో కథనం కూడా ప్రచురితమైంది. పేద ప్రజల ఆకలి తీర్చే ఇందిరా క్యాంటీన్లు మూతబడడంతో నగరంలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

స్థానికంగా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఉన్నా... సార్థకం లేదంటూ నగర ప్రజల నుండి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై రాష్ట్ర స్థాయిలో చర్చలు జరగడంతో.. ప్రభుత్వం జిల్లా పాలనా మండలికి వెంటనే మూతబడిన ఇందిరా క్యాంటీన్లను తెరవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

ప్రస్తుతం నగరంలో నిర్వహిస్తున్న ఇందిరా క్యాంటీన్ల నిర్వహణ బాధ్యత బళ్ళారి సిటీ కార్పొరేషన్‌పైనే ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్పొరేషన్ నుంచి 70శాతం నిధులు, కార్మిక శాఖ నుండి 30 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. గత మూడేళ్ళుగా నిధులు విడుదల కాకపోవడంతో సుమారు 3.6 కోట్ల బకాయిలు పేరుకు పోయినట్లు క్యాంటీన్ నిర్వాహకులు తెలుపుతు



మోతీ సర్కిల్‌లోని ఇందిరా క్యాంటిన్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

న్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడంతో విధిలేని స్థితిలో క్యాంటీన్లను మూసి వేయాల్సి వచ్చిందని నిర్వహకులు మహదేవ తెలిపారు. అయితే ఇందిరా క్యాంటీన్ల నిర్వహణ కాంట్రాక్టు మరో వ్యక్తి దక్కించుకోవడంతో నిధుల విడుదలలో అధికారులు జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం రూ.10లకే ఆకలి తీర్చే క్యాంటీన్లు మూతబడడంతో పేద విద్యార్థులు, కూలీ కార్మికులు రోజూ వచ్చి ఆకలితీర్చుకోకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో నిర్వాహకులతో బళ్ళారి కార్పొరేషన్ కమీషనర్ చర్చలు జరిపి వారం రోజుల్లోగా నిధులు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు క్యాంటీన్ల నిర్వాహకులు శనివారం నుంచి క్యాంటీన్లను తిరిగి ప్రారంభించారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

నవ బృందావనంలో ప్రత్యేక పూజలు

కంప్లి, ఫిబ్రవరి 11 : ఆనెగొంది నవ బృందావనంలో ఆదివారం జయతీర్థ స్వాములకు శ్రీ రాఘవేంద్ర స్వామి మఠాధీశ్వరులు సుబేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేపట్టారు. సుప్రభాతం, పంచామృతాభిషేకం, అష్టోత్తరం, కీర్తనలు, పుష్పాలతో ప్రత్యేకాలంకరణ, మహామంగళహారతి తదితర పూజలు చేపట్టారు.

ప్రతి యేటా జయతీర్థులకు ఈ నవ బృందావనంలో ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు సమర్పించుకుంటామని భక్తాదులు తెలిపారు. కార్యక్రమంలో అనుమేష్ ఆచార్య, పవన ఆచార్య, రాఘవేంద్ర దేశాయ్, సామవేద గురురాజా ఆచారి, నవిలి సుధీర్, ఆనెగొంది మఠం వ్యవస్థాపకులు సుమంత్ కులకర్ణి, నరసింహాచారి, విజయేంద్ర తదితరులు పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు.



జయతీర్థ బృందావనం వద్ద పూజలు చేపడుతున్న అర్చకులు

కంప్లి ఉత్సవం నిర్వహించాలి: బీజేపీ



ఎమ్మెల్యే పీఏకు మనవిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కంప్లి, ఫిబ్రవరి 11: కంప్లి ఉత్సవం కూడా లోక్ సభ ఎన్నికలకు ముందుగానే జరపాలంటూ బీజేపీ పార్టీ నాయకులు ఎమ్మెల్యే జేఎన్ గణేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ అధ్యక్షులు హళ్లి వీరేష్ మాట్లాడుతూ, ఈ ప్రాంతాన్ని కరువు తాలుకాగా ప్రకటించినా ఇంతవరకు పంట నష్టపోయిన రైతన్నల ఖాతాలో సొమ్ము జమకాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం వల్లే గ్రామాలలో తాగునీరు, రోడ్ల సమస్య, బస్సులు, ఇతర అంశాలపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే రైతులకు కూడా సక్రమంగా విద్యుత్ అందక వేసుకున్న పంటలు కూడా ఎండిపోతున్నాయని, గతంలో బీజేపీ ప్రభుత్వంలో వున్న సమయంలో తమకు నిధులు ఇవ్వలేదని చెప్పేవారని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వున్నా శిక్షణ అధికారి కార్యాలయం, అగ్నిమాపక దళం మరెన్నో తాలుకాకు కావాల్సిన కార్యాలయాలు ఏర్పడవలసి వుందన్నారు. అలాగే నూతన తుంగభద్ర వంతెన ఏర్పాటు కోసం ప్రస్తుత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అలాగే గతేడాది మాదిరిగానే కంప్లి ఉత్సవం కూడా జరపాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ పీఏలకు మనవిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎర్రంగళి తిమ్మారెడ్డి, వీరేష్ గౌడ, సుగుణ, సుమారెడ్డి, బ్రహ్మయ్య, పురుషోత్తమ్, సిద్దప్ప, సుధాకర్, రామయ్య పాల్గొన్నారు.

పాత్రలు తోమిన గవిసిద్దేశ్వర స్వామి



వంట పాత్రలు శుభ్రం చేస్తున్న గవిమఠం స్వామీజీ..

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 11: సాధారణంగా మఠం స్వామిజీలు అంటే... నిత్యం పూజలు, పురస్కారాల్లో మునిగితేలుతుంటారు. అయితే...గవిసిద్దేశ్వర మఠం అధిపతి మాత్రం మఠంలో ధార్మిక కార్యక్రమాలు ఎంత ముఖ్యమో నిత్యం జరిగే అన్నదాసోహ కార్యక్రమంలో శుభ్రత కూడా అంతే ముఖ్యమని చెబుతుంటారు. అంతేనా? అయనే స్వయంగా పాత్రలు తోముతూ సరళతను చాటుకుంటారు. దక్షిణ కాశీగా చెప్పుకునే కొప్పళ నగరంలో ప్రతి యేటా జరిగే గవిసిద్దేశ్వర స్వామి మహారథోత్సవం... దక్షిణ భారత దేశంలో ఎక్కడా లేని విధంగా అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ ఏడాది కూడా రథోత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. గవిమఠం జాతర మహోత్సవంలో భాగంగా శుక్రవారం అమావాస్య రోజున లక్షలాది మంది భక్తులకు మహాదాసోహ కార్యక్రమాన్ని నిర్వహించారు. మఠం భక్తులు, స్వయం సేవకులతో స్వామిజీ చేతులు కలిపి వంట పాత్రలను స్వయంగా శుభ్రంచేశారు. ఆవరణలో చెత్తాచెదారం తొలగించడంతోపాటు పాత్రలు శుభ్రంచేయడం కూడా స్వామీజీ తరచూ నిర్వహిస్తూ తన సరళత్వాన్ని చాటుకొన్నారు. స్వామిజీ చూపిన బాటలో ప్రతిఒక్కరూ జాతర మహోత్సవంలో పాల్గొనడం విశేషం.

గొర్రెల పాలైన వరి పంట



తెగుళ్లతో నష్టపోయిన పంటను గొర్రెలు, మేకలకు వదిలేసిన దృశ్యం

కంప్లి, ఫిబ్రవరి 11 : ఖరీఫ్‌లోనే రైతన్నలకు అంతంత మాత్రంగానే పంటలు చేతికొచ్చాయి. రబీలో కూడా రైతులు మొండి ధైర్యంతో బోర్ల కింద వరినాట్లు వేశారు. కానీ ఆ పంటలు కొన్ని చోట్ల వైరస్ తెగుళ్ల సోకి నష్టం వాటిల్లింది. మరొకచోట నీరు లేక పంటలు ఎండిపోయాయి. మొత్తానికి రబీ పంటలు రైతన్నకు నష్టాన్నే మిగిల్చాయి. సన్నాపురం వద్ద నాలుగు ఎకరాల్లో వీరేష్ గౌడ పంట సాగు చేయగా పూర్తిగా నష్టపోయి చివరికి కష్టాలనే మిగిల్చింది. చిక్కజంతిగల్ రైతు బిల్లనగౌడ వేసుకున్న వరి పంట వైరస్ తెగుళ్ల ప్రభావంతో పూర్తిగా నష్టపోయాడు. చివరకు పొలంలో సేంద్రీయ ఎరువుఅయినా పడుతుందనే ఉద్దేశంతో మేకలు, గొర్రెలకు పంటను వదిలేశారు. ఈ యేడాది వర్షాలు లేకపోవడంతో రైతులకు ఎటు చూసినా కష్టాలే మిగిలాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో కరువు కారణంగా నష్టపోయిన రైతుల జాబితాను ఇప్పటికే వ్యవసాయ శాఖ సేకరించిందని, ఇంతవరకు ప్రభుత్వం వారికి నష్టపరిహారం ఇవ్వలేదని రైతు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధిహామీ పనుల కింద అమృత సరోవర



వేణి వీరాపురం వద్ద పూర్తయిన అమృత సరోవర్ చెరువు

కంప్లి, ఫిబ్రవరి 11 : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద కురుగోడు తాలుకా వేణి వీరాపురం గ్రామంలో హరిగిణదోణి రోడ్డు మార్గంలో అమృత సరోవరను ఏర్పాటుచేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో జోరుగా పనులు జరుగుతున్నాయి. పొలం గట్టు పనులు, నీటి కుంటలు, చెరువుల ఏర్పాటు తదితర పనులు జోరుగా జరుగుతున్నాయి. ఒకొక్క కూలీకి రూ. 316ల చొప్పున రూ. 49 లక్షల వ్యయంతో ఈ చెరువు పనులు పూర్తి చేశారు. ఇందులో కూలీలకు రూ. 15.15 లక్షలు, సామగ్రికి మొత్తం రూ. 49 లక్షలు ఖర్చు అయిందని పీడీవో రామాలి తెలిపారు. గ్రామంలో నీటి సమస్య వుండటం వల్ల ఇక్కడ చెరువును ఏర్పాటు చేశామన్నారు. వర్షాకాలంలో పై భాగం కొండల్లో నుంచి కింది ప్రాంతాలకు వృథాగా నీరు వెళ్లకుండా ఇక్కడ చెరువును ఏర్పాటు చేశామని తెలిపారు.

బాధ్యతలు తీసుకుంటున్న సీఐకు ఘన సన్మానం

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 11 : తాలుకాలోని పీడీ హళ్లి మోకా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ బెల్గామ్ జిల్లా కాకతీయ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, దావణగెర నుంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప ఎల్ మోకా పోలీస్ స్టేషన్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు సీఐలను ఆదివారం పోలీసులు ఘనంగా సన్మానించారు. పీడీ హళ్లి ఎస్ఐ శశిధర్, మోకా ఎస్ఐ కాళింగ నేతృత్వంలో బదిలీపై వెళుతున్న, బదిలీపై వచ్చిన సీఐలకు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎస్ఐ శశిధర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల ఆరు నెలల పాటు మోకా, పీడీ హళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్తమ సేవలందించి బదిలీపై వెళుతున్న సీఐ ఉమేష్‌ను కొనియాడారు. అదేవిధంగా నూతనంగా సీఐగా వచ్చిన రుద్రప్పను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేష్ పాల్గొన్నారు.

హోసూరు జోన్

అమరగాయకుడికి ఘన నివాళులు



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఘంటసాల అభిమానులు

హోసూరు, ఫిబ్రవరి 11: నగరంలోని ఆంధ్ర సాంస్కృతిక సమితిలో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి ఆయన అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆలపించిన పాటలను, పద్యాలను పాడి వినిపించారు. కార్యక్రమంలో ఘంటసాల అభిమానులు, తెలుగు భాషాభిమానులు, ప్రముఖులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న సోమశేఖర్‌రెడ్డి

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

హోసూరు, ఫిబ్రవరి 11: హోసూరు ప్రభుత్వ బాలికల ఉన్నత స్థాయి పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఇక్కడ రెండు వేలమందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. మాతృభాషా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎల్లోరమణి అధ్యక్షత వహించగా ప్రధానోపాధ్యాయురాలు లత అందరికీ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య, పాల్గొని మొక్కలు నాటడంతో పాటు విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెల్త్ కమిటీ ఛైర్మెన్ మాదేశ్, కౌన్సిలర్లు నాగరాజ్, మోసిన్ తాజ్ నిసార్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ప్రముఖులు

గ్రామగ్రామానా బీజేపీ ప్రచారం

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 11: నగరంలోని ముండరగి ఏరియాలో గ్రామగ్రామానా బీజేపీ ప్రచారాన్ని మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి మళ్ళీ దేశానికి సేవ చేసేలా చూడాలని విజ్ఞప్తి చేస్తూ ప్రతి ఇంటికి కరపత్రాలు అందజేస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలను వివరించారు. ముండరగిలో ప్రతి బూత్‌లో కార్యకర్తలను కలిసి సింపుల్ అప్లికేషన్ల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు శ్రీనివాస్ మోత్కర్, వీరశేఖర్‌రెడ్డి, తిమ్మప్ప, వెంకటేశ్,గోవింద్,వసంతరావు, రమేశ్, ఫిరోజ్ ఖన్నా, రమేశ్ యాదవ్, నాగరాజు, బూత్ కమిటీసభ్యులు శీనప్ప, భోజరాజా,సురేశ్‌రెడ్డి ,కాంద్రబాబు తదితరులుపాల్గొన్నారు.

బొలెరో వాహనం బోల్తా: యువకుడి దుర్మరణం



బోల్తాపడిన బొలెరో వాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాయచూరు, ఫిబ్రవరి 11: వేగంగా వెళుతున్న బొలెరో వాహనం ఒకటి బోల్తా కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఆంజనేయ అనే యువకుడు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. ఈ ప్రమాదం ఆదివారం ఉదయం రాయచూరు తాలూకాలోని చంద్రబండా సమీపంలో చోటు చేసుకుంది. పరిమితికి మించి ఇనుప వస్తువులు వేసుకు వెళుతున్న బొలెరో వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంతో బోల్తాగొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావానికి గురైన ఆంజనేయ అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. మరో ఇద్దరిని చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన యాపలదిన్ని పోలీసులు కేసు నమోదు చేశారు.

భావసార క్షత్రియ సంస్థను బలోపేతం చేయండి : రూపానంద




మాట్లాడుతున్న తత్వారూపానందస్వామి తదితరులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 11: భావసార క్షత్రియులు ఐక్యతతో సంస్థను బలోపేతం చేయాలని ముంబై రామకృష్ణ పరమహంస ఆశ్రమానికి చెందిన తత్వారూపానంద స్వామీజీ అన్నారు. హూవినహడగలి పట్టణంలో పాండురంగ రుక్మిణి తదితర దేవతామూర్తుల ప్రతిష్టాపనలో భాగంగా భావసార క్షత్రియ సంఘం ధార్మిక సభలో ఆయన ప్రసంగిస్తూ భావసార క్షత్రియులు మైనార్టీ అయినప్పటికీ అన్ని వర్గాలతో కలిసి మెలిసి జీవించే గుణాన్ని పెంపొందించుకున్నారన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

చార్లెస్ డార్విన్ (జయంతి)



జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ రాబర్ట్ డార్విన్ 1809 ఫిబ్రవరి 12న జన్మించారు. ఇంగ్లండ్‌కు చెందిన ఆయన గొప్ప ప్రకృతి శాస్త్రవేత్త. భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే అంశంపై పరి శోధనలు చేశారు. ఒక మాతృక నుంచి సకల జీవరాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడ్డాయని ఈ చర్య నిరంతరంగా ఉంటుందని తొలిసారిగా వివరించినది చార్లెస్ డార్విన్ మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా 400కుపైగా పురస్కారాలు పొందారు. 1882 ఏప్రిల్ 19న కన్నుమూశారు.

అబ్రహాం లింకన్ (జయంతి)



ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ 1809 ఫిబ్రవరి 12న జన్మించారు. జాతీయనేత, న్యాయవాది. అమెరికా సంయుక్త రాష్ట్రాలకు 16వ అధ్యక్షుడిగా 1861 నుంచి వ్యవహరించారు. అమెరికా అంతర్యుద్ధంలోనూ అత్యంత కార్యదక్షతతో పాలన సాగించారు. 1865 ఏప్రిల్ 15న హత్యకు గురయ్యాడు. లింకన్ గొప్పదనానికి గుర్తుగా అమెరికా కరెన్సీపై పెన్నీ, 5 డాలర్లపై ఆయన బొమ్మ ఉంటుంది.

రమారవి (పుట్టినరోజు)



రమారవి 1943 ఫిబ్రవరి 12న చెన్నైలో జన్మించారు. తల్లి తులసి సుబ్రమణియమ్ వద్ద సంగీతంలో తర్ఫీదు పొందారు. సంగీతం, భరతనాట్యంలలో పేరొందారు. ధనమ్మాల్ స్కూల్‌లో బోధనలు అందించారు. ఆలిండియా రేడియోలో ప్రముఖ కళాకారిణి. పండిట్ వినయ్‌చంద్ర మౌద్గాలయ వద్ద శిక్షణతో హిందూస్తానీ సంగీతంలో రాణించారు. మ్యూజిక్ అకాడమీ మద్రాస్‌చే 2012లో సంగీత కళా ఆచార్య పురస్కారం పొందారు.

రవికిరణ్ (పుట్టినరోజు)



నరసింహన్ రవికిరణ్ 1967 ఫిబ్రవరి 12న మైసూరులో జన్మించారు. దేశంలో పేరొందిన సంగీతకారుడు. తన ఐదవ యేటనే గాయనం, వాద్య కారుడిగా ప్రతిభను చాటుకున్నారు. స్వర కర్తగా రాణించారు. ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లోనూ పలు కచేరీలు ప్రదర్శించారు. కంజీర, ఘటం, మృదంగంలో సోలో, డ్యూయో ప్రదర్శనలు ప్రత్యేకం. పియానో, కీబోర్డ్, గిటార్, ఇతర వాదనలలోనూ రాణించారు. సంగీత చూడామణి, సంగీత కళానిధి, ఇతర పురస్కారాలు పొందారు.

మడమ నొప్పులను నిర్లక్ష్యం చేయొద్దు

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాలి మడమ నొప్పులను నిర్లక్ష్యం చేయరాదని తద్వారా పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనాల్సి ఉంటుందని డాక్టర్ జయ కృష్ణన్ పిళ్ళై అభిప్రాయపడ్డారు. జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్‌గా వ్యవహరిస్తున్న ఆయన ఆర్థో సమస్యలపై ప్రత్యేకంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య రక్షణకు వాకింగ్, జాగింగ్ వంటివి పాటించడం సముచితమన్నారు. కాలి మడమ లేదా వెనుకభాగంలో వచ్చే నొప్పుల పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. మెట్లు ఎక్కే సమయంలో సమస్యను తీవ్రతం చేసుకోరాదన్నారు. ఆరోగ్య పరీక్షల వేళ వాపు, మృదుత్వం ఇతరత్రా సమస్యలు ఉంటే నిపుణులను సంప్రదించాలన్నారు. ఎక్స్‌రే, ఎంఆర్ఐ వంటి పరీక్షల ద్వారా నొప్పికి గల కారణాలను తెలుసుకోవాలన్నారు. మడమ నొప్పిని బట్టి దైనందిన జీవనంలో మార్పులు వస్తాయన్నారు. నొప్పి నివారణకు విశ్రాంతితోపాటు నిపుణుల సహాలు పాటించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఇతరత్రా సమస్యలు తలెత్తుతాయన్నారు.

మొబైల్ ఆటలు వ్యసనం కారాదు

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో మొబైల్ వాడకం సాధారణమైందని, ప్రతి పనిని మొబైల్ ద్వారానే జరుపుకొంటున్నారని వీటి ద్వారా ఆడే ఆటలు వ్యసనం చేసుకోరాదని ఆర్థిక నిపుణులు, కేంద్ర ప్రభుత్వ మాజీ అధికారి అరుణ్‌శర్మ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఐ గేమింగ్ ఆడేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. 2023లో ప్రభుత్వం నియంత్రణ, పన్నుల పాలసీలలో కీలకమైన మార్పులు చేసిందన్నారు. దేశంలో 15శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని అయితే దేశవ్యాప్తంగా 6.59 కోట్లమంది స్మార్ట్ ఫోన్‌ను ఉపయోగిస్తున్నారన్నారు. 25ఏళ్లలోపువారు 50శాతం, 35ఏళ్లలోపువారు 65శాతం మొబైల్ ఎక్కువ వాడుతున్నారన్నారు. స్మార్ట్‌ఫోన్‌లలో మాట్లాడుకోవడమే కాకుండా సోషల్‌మీడియాతోపాటు పలు వెబ్‌సైట్‌ల ద్వారా గేమ్స్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ఆడుతున్నారన్నారు. ఐ గేమ్ సరదా వరకు అయితే ఫర్వాలేదు గానీ వ్యసనమైతే ఆర్థికంగా నష్టపోతారన్నారు. ఐ గేమింగ్ ద్వారా ఆర్థిక నష్టం, మానసిక సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుంది. అయితే ఐ గేమింగ్ రంగంలో మార్పులు, ఆవిష్కరణలు పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయన్నారు. ఐ గేమింగ్ అవగాహన లేకుండా ఆడరాదని అభిప్రాయపడ్డారు.

అలరించిన భరతనాట్యం

చింతామణి, ఫిబ్రవరి 11: తాలూకాలోని కైవార పుణ్య క్షేత్రంలో యోగినారేయణ మఠం సుధారస సాంస్కృతిక వేదికపై బెంగళూరు క్రిష్టి ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతనాట్య కార్యక్రమం సభికులను అలరించింది. భవ్య మంజునాథ్ నేతృత్వంలో పలు కీర్తనలకు కళాకారుల బృందం ప్రదర్శన చేసింది. కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం కళాకారులను అభినందించారు. నాదసుధారస సంచాలకులు వానరాశి బాలకృష్ణ భాగవతార్ కళాకారులను ఆత్మీయంగా సత్కరించారు.

సమాజసేవలో ఆర్యవైశ్యుల భాగస్వామ్యం ఎనలేనిది

▸▸ స్కాలర్‌షిప్‌ల పంపిణీలో మంత్రి రామలింగారెడ్డి



స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో మంత్రి రామలింగారెడ్డి, నిర్వాహకులు

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు వ్యాపారరీత్యా స్థిరపడినా సమాజసేవలో వారి భాగస్వామ్యం నిరంతరమని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి వెల్లడించారు. కర్ణాటక ఆర్యవైశ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉన్నత విద్య చదివే విద్యార్థులకు, దివ్యాంగులకు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు ఐఎస్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యులుగా పాల్గొన్న మంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు విద్యాభివృద్ధికి కాకుండా ఆధ్యాత్మికంగాను వారి సహకారం ప్రతి ఆలయానికి ఉందన్నారు. ఎంపీ తేజస్వీ సూర్య మాట్లాడుతూ సమాజంలో విద్య ద్వారానే మార్పు సాధ్యమని, పేద, ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా ఓ సందేశం ఇచ్చినట్టు అయ్యిందన్నారు. ఆర్యవైశ్య అభివృద్ధి మండలి మాజీ ఛైర్మన్, ఎమ్మెల్సీ డీఎస్ అరుణ్ మాట్లాడుతూ వైశ్య సమాజం భిన్నమైన రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల లావాదేవీలు ఆర్యవైశ్యుల ద్వారానే సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఆర్యవైశ్య అభివృద్ధి మండలికి కేటాయించే నిధులు సంపూర్ణంగా సద్వినియోగం కావాలన్నారు. సమాజానికి మనవంతు భాగస్వామ్యం ఉండాలనేది ప్రతి ఒక్కరిలోనూ రావాలన్నారు. ప్రోత్సాహకాలు పొందుతున్నవారు భవిష్యత్తులో మరికొంతమంది చదువుకు తోడ్పడాలని సూచించారు. ఆర్యవైశ్య చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ఐఎస్ ప్రసాద్ మాట్లాడుతూ 840మంది విద్యార్థులకు సుమారు కోటి రూపాయలు ప్రోత్సాహకాలను అందించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభ, పేద ఆర్యవైశ్య విద్యార్థులతోపాటు దివ్యాంగులకు ప్రోత్సాహకం ఇచ్చామన్నారు. ప్రస్తుతానికి 560మందికి చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. మిగిలినవారికి పోస్ట్ ద్వారా అందిస్తామన్నారు. 70మంది దివ్యాంగులకు రూ.5వేలు చొప్పున చెక్కులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు జనరల్ సెక్రటరీ కాశినాథ్, శ్రీనివాస్ గుప్త, కార్యదర్శులు శరవణ గుప్త, ద్వారకనాథ్, ఉపాధ్యక్షుడు కేఆర్ ప్రదీప్, కోశాధికారి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో క్రీడలకు మైదానాలు ఉండాలి



పెవిలియన్ ప్రారంభంలో మాజీ క్రికెటర్ రఘురామ్‌భట్ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలలో క్రీడలకు అనువుగా మైదానాలు ఉండాలని మాజీ క్రికెటర్, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్ రఘురామ్‌భట్ అభిప్రాయపడ్డారు. సీఎంఆర్ యూనివర్సిటీలో నిర్మించిన క్రికెట్ స్టేడియం పెవిలియన్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామ్‌భట్ మాట్లాడుతూ క్రికెట్‌కు విశ్వవ్యాప్తంగా క్రేజ్ ఉందన్నారు. రాష్ట్రం నుంచి దశాబ్దాలకాలంగా భారత జట్టులో ప్రాతినిథ్యం ఉందన్నారు. అందుకు ఇక్కడి శిక్షణలు మైదానాలు కారణ మన్నారు. విద్యార్థి దశలోనే క్రికెట్‌లో శిక్షణ పొందితే రాణించవచ్చునన్నారు. నిరంతరం క్రికెట్‌పై దృష్టి సారిస్తే ఉన్నత శిఖరాలకు వెళ్లవచ్చునన్నారు. సీఎంఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ కేసీ రామమూర్తి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థి జీవితంలో అవినాభావ సంబంధం కలిగి ఉంటాయన్నారు. క్రీడలను ప్రోత్సహించాలనే స్టేడియం నిర్మించామన్నారు. ఆరు రోజుల టి-20 టోర్నమెంట్‌లో 16 యూనివర్సిటీల జట్లు పాల్గొంటున్నాయని, విజేతలకు రూ.25వేల నగదు బహుమతి అందిస్తామన్నారు. రాష్ట్ర క్రికెట్ సంస్థ కార్యదర్శి శంకర్, సీఎంఆర్ జ్ఞానధార ట్రస్టు కార్యదర్శి జగన్నాథరెడ్డి, ప్రొ-చాన్స్‌లర్ జయదీప్‌రెడ్డి, కులపతి హెచ్‌బీ రాఘవేంద్ర, రిజిస్ట్రార్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి ఆర్టీసీ సేవలపై హర్షం



బస్సుకు పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

బాగేపల్లి, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో కొన్ని తాలూకాలలో కనీస సదుపాయాలు, రవాణా వ్యవస్థ లేని గ్రామాలు ఉన్నాయి. తాలూకాలోని పోకమాకలపల్లి గ్రామానికి ఇదే తొలిసారిగా బస్సు వ్యవస్థ కల్పించారు. దశాబ్దాల కల సాకారమైందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేకించి గ్రామానికి చెందిన విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. బాగేపల్లి కేఎస్ఆర్టీసీ డిపో నుంచి పోకమాకలపల్లికి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు సర్వీసులు నడపనున్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల అధికారుల భరోసాతో సాధ్యమైందన్నారు. సోమవారం నుంచి సర్వీసులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆదివారం గ్రామానికి బస్సులు రాగా ప్రజలు ప్రత్యేకపూజలు చేశారు. గ్రామపంచాయతీ సభ్యుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే సుబ్బారెడ్డి చొరవతోనే ఇది సాధ్యమైందన్నారు. ఉదయం 9 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బస్సు సర్వీసులు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు అశోక్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రామలింగారెడ్డి, హెచ్ నాగేంద్ర, నంజప్ప, వెంకటేశ్, బస్సు డ్రైవర్ నరసింహమూర్తి, కండక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాసా పోటీల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభావంత విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన నాసా అనుబంధమైన నేషనల్ స్పేస్ సొసైటీ ప్రపంచవ్యాప్తంగా 12-18 లోపు విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో కర్ణాటక నుంచి చైతన్య విద్యాసంస్థల నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శశికళ ప్రకటించారు. ఆదివారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. స్పేస్ సెటిల్‌మెంట్‌లో అగ్రికల్చర్ మాడ్యూల్ డిజైన్‌పై నిర్వహించిన 'లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్' పోటీలలో శ్రీచైతన్య వరల్డ్ చాంపియన్‌గా నిలిచిందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రకటించిన ఫలితాలలో 47 ప్రాజెక్టులలో 28 ప్రాజెక్టులు శ్రీచైతన్య నుంచే ఎంపికయ్యాయన్నారు. కర్ణాటక నుంచి రెండు ప్రాజెక్టులు అర్హత పొందాయన్నారు. ఇందులో విద్యారణ్యపురశాఖకు చెందిన విద్యార్థులు జశ్వంత్ (9వ తరగతి), యశస్ (8వ తరగతి), పూర్వి సాయి, అనుశ్రీలు (6వ తరగతి) చెందినవారు రూపొందించారు. ఈమేరకు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించినట్టు ప్రకటించారు. జోనల్ డీన్ చంద్రబాబు, డీన్ శ్రీధర్ పండా, వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, రాజ్యలక్ష్మి సహా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నూతన భవనానికి శంకుస్థాపన



భూమిపూజలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 11: తాలూకాలోని తొప్పనహళ్ళి గ్రామపంచాయతీ నూతన భవనానికి ఎమ్మెల్యే, నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు నారాయణస్వామి శంకుస్థాపన చేశారు. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుమారు 30 లక్షల రూపాయలతో నూతన భవనం నిర్మించనున్నట్టు పేర్కొంటూ తన గ్రాంటుకింద రూ.10లక్షలు కేటాయిస్తున్నట్టు తెలిపారు. భవన నిర్మాణానికి చక్కటి బ్లూప్రింట్‌ను ఇంజనీర్ సిద్ధం చేశారన్నారు. కాగా తొప్పనహళ్ళి ఆలయ కల్యాణమండపానికి విడుదల చేసిన గ్రాంటును బీజేపీ ప్రభుత్వం వాపసు తీసుకుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.45లక్షలు విడుదల చేసిందని, త్వరలోనే పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లావణ్య హంసానంద, మాజీ అధ్యక్షులు, సభ్యులు నాగవేణి, లక్ష్మీనారాయణ ప్రసాద్, ప్రముఖులు చిక్కవలగమాది మునిరాజు, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ గోవిందరాజు, కామసముద్ర గ్రామ పంచాయతీ అధ్యక్షుడు ఆదినారాయణ కుట్టి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల సమస్యలు పట్టించుకోండి



సువర్ణ కర్ణాటక జనశక్తి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగేనహళ్లి కృష్ణమూర్తి తదితరులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 11: ఎవరైనా చేయూత ఇవ్వడంలో తమకు అభ్యంతరం లేదని అయితే సామాన్యులు ఎదుర్కొంటున్న విద్య, ఆరోగ్య రంగానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సువర్ణ కర్ణాటక జనశక్తి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగేనహళ్ళి కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటైన సమావేశంలో సంఘం జిల్లా, తాలూకా నూతన పదాధికారుల నియామక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత పథకాలకోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. అయితే పబ్లిక్ టాయ్‌లెట్‌ల వద్ద శుల్కం వసూలు చేయడం ద్వారా మహిళలు చాలామంది వెళ్లడం లేదన్నారు. దీంతో పరోక్షంగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అనంతరం నూతన పదాధికారులుగా సురేశ్ భగత్, మధు, నరేశ్, గంగాధర్, కృష్ణప్ప, బాబు, సాక్‌బాషా, అరవింద్, మురళి, అంబారి మంజు తదితరులుగా ప్రకటించారు.

వాసవీమాతకు విశేషపూజలు



ఆర్ఆర్‌నగర్ గిరిధామ లే అవుట్‌లో అమ్మవారికి వజ్రకవచధారణ



సిద్ధాపురలో ఉత్సవమూర్తికి అలంకరణ



చేళూరులో అమ్మవారికి అలంకరణ

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని జయనగర 1వ బ్లాక్ సిద్ధాపురలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీరామసేవా సముదాయభవనంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఉత్సవమూర్తికి అభిషేకం, అలంకరణ చేశారు. వాసవీ హోమం, లలితా సహస్రనామ పారాయణ చేశారు. గాయత్రిమాత అలం కరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. సిద్ధాపుర ఆర్యవైశ్యమండలి, మహిళా మండలి, యువజన సంఘం సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా రాజరాజేశ్వరినగర్ గిరిధామ లే అవుట్‌లోని ఆలయంలోనూ విశేష పూజలు కొనసాగాయి.

చేళూరులో..

చేళూరు: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని చేళూరు తాలూకా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి సత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవంలో ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ 'గ్యారెంటీలు రద్దు ప్రకటిస్తారా..?'

▸▸ ముఖ్యమంత్రి సిద్దరామయ్య సవాల్

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ గ్యారెంటీ పథకాలను నిలిపివేస్తామని ప్రకటిస్తారా..? అంటూ సీఎం సిద్దరామయ్య సవాల్ విసిరారు. గ్యారెంటీ పథకాలపై వ్యతిరేకత ఉంటే బీజేపీ నేతలు విడతలవారీగా కాకుండా ఒకేసారి నేరుగా స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ విధానం బీజేపీ పాలిత రాష్ట్రాలకు వర్తిస్తుందని బహిరంగంగా ప్రకటించగలరా..? సవాల్ చేశారు. ఆదివారం సీఎం సిద్దరామయ్య ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కర్ణాటక పర్యటనకు వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గ్యారెంటీ పథకాలతో ఖజానా ఖాళీ అయ్యిందని, మా ప్రభుత్వంపై ఈర్ష్యను వ్యక్తపరిచారన్నారు. ఇదే అమిత్ షా ఖచ్చితమైన అభిప్రాయమైతే నాతో బహిరంగ చర్చకు సిద్ధమా..? అంటూ సవాల్ చేశారు. గ్యారెంటీలతో మా ఖజానా ఖాళీ కాలేదని పన్నుల వాటా, కేంద్రం నుంచి గ్రాంట్ల కోత వంటి కారణాలతో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. వీటిని నిరూపిస్తానని సవాల్ చేశారు. కర్ణాటకలో గ్యారెంటీ పథకాలను వ్యతిరేకించే బీజేపీ నాయకులు తమ పార్టీ పాలిత రాష్ట్రాలలో ఇదే విధమైన గ్యారెంటీలను ప్రకటించారని వాటిని రద్దు చేస్తారా..? అంటూ ప్రశ్నించారు. మా గ్యారెంటీలను విమర్శించే ప్రధాని నరేంద్రమోదీ అదే పేరుతో ప్రకటనలు ఇచ్చారన్నారు. పేదల పట్ల బీజేపీకి ఉన్న వ్యతిరేకత ఏ పాటిదో తెలుస్తోందన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షాలతోపాటు రాష్ట్ర నాయకులు విమర్శిస్తున్నది గ్యారెంటీ పథకాలను కాదని పేదలకు అమలవుతున్న సంక్షేమాల గురించి అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ విధానమే ఇదన్నారు. ఇందిరాగాంధీ గరీబీ హటావో పిలుపునకు వ్యతిరేకించారన్నారు. సీఎంగా గతంలో ఐదేళ్లపాలనలో అన్నభాగ్య, క్షీరభాగ్య, ఇందిరా క్యాంటీన్‌లు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయని, బీజేపీ నాయకులు వాటిని విమర్శించారన్నారు. అమిత్‌షాకు కన్నడిగులంటే ఉదాశీనమన్నారు. కన్నడ పతాకాన్ని వ్యతిరేకిస్తారని, హిందీని ప్రోత్సహించే ప్రయత్నం చేశారన్నారు. నందిని ఉత్పత్తులపై అముల్ బ్రాండ్ తీసుకొచ్చేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. పేదల కడుపు కొట్టి ఎన్నిసార్లు రామనామం జపించినా అది వ్యర్థమే అన్నారు. పేదలకు అన్నం ఇవ్వకుండా దేవుడికి నైవేద్యం పెట్టడం ఏం లాభమన్నారు. పేదలకు ఇల్లు నిర్మించకుండా దేవుడికి గుడి కడితే ఏం ఫలితమన్నారు. గ్యారెంటీలను వ్యతిరేకించే వారికి రాముడి దయ ఉండదని, చాముండేశ్వరి ఆశీస్సులు ఉండవంటూ మండిపడ్డారు.

చిరు కవితలు శక్తివంతమైనవి



పుస్తకాల ఆవిష్కరణలో రచయిత నారాయణస్వామి తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చిరు కవితలు శక్తివంతమైనవని, అర్థవంతమైనవని అధ్యాపకులు, రచయిత కేవై నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. కోలారులో డాక్టర్ సీఏ రమేశ్ రచించిన శతమానద హనిగవితె, డాక్టర్ శివప్ప అరివు రచించిన కాలద కై హిడిదు పుస్తకావిష్కరణ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యులుగా పాల్గొన్న నారాయణస్వామి మాట్లాడుతూ చిరుకవితల ద్వారా ఏం చెప్పదలచుకున్నారో ఆ అంశాన్ని సూటిగా పొందరుపరుస్తారన్నారు. చిరు కవితలు అర్థవంతంగా ఉంటాయని, వేగంగా ప్రజాదరణ పొందుతాయన్నారు. సుదీర్ఘమైన రచనలను చదివి అర్థం చేసుకునేవారి సంఖ్య తగ్గుతోందని, చుటుకు సాహిత్యానికి ఆదరణ పెరుగుతోందన్నారు. శతమానద హనిగవితెకు కుప్పం ద్రవిడ యూనివర్సిటీ డాక్టరేట్ ఇవ్వడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఎస్ఎస్ శాస్త్రి, కే నరసింహమూర్తిలు ముఖ్యులుగా పాల్గొనగా డీసీపీ డీ దేవరాజ్ అధ్యక్షత వహించారు. ద్రవిడ యూనివర్సిటీ అధ్యాపకులు ప్రొఫెసర్ వీఎస్ శివకుమార్, సమాజ సేవకులు సీఎంఆర్ శ్రీనాథ్, విజయ్‌కుమార్, కసాప జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ గోపాలకృష్ణతోపాటు కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి సహా సాహితీ అభిమానులు భాగస్వామ్యులయ్యారు.

వెట్టిచాకిరి బాధితులకు పునరావాసం



సమావేశంలో తహసీల్దార్ స్వామి తదితరులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 11: తాలూకాలోని వెట్టిచాకిరీ నుంచి బయటపడినవారికి పునరావాసం, ఇతర సౌలభ్యాలు ప్రామాణికంగా అందించేలా చర్యలు చేపడతామని తహసీల్దార్ బీఎన్ స్వామి పేర్కొన్నారు. తాలూకా పంచాయతీ కార్యాలయంలో వెట్టిచాకిరీ నిర్మూలనా దినోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ 2019 నుంచి విముక్తి పొందిన వారికి వెట్టిచాకిరీ ప్రమాణపత్రం ఉందని ఇందుకు సంబంధించి అధికారులతో చర్చలు చేస్తున్నట్టు తెలిపారు. పొలాల్లో వెట్టి చాకిరీ చేస్తున్న అంశంపై అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో సాగుకు అవకాశం లేదన్నారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ అటవీశాఖ సంయుక్తంగా సర్వే చేయగా వారికి అనుకూలంగా నివేదిక రావడంపై అంశంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. సమస్యలను పరిష్కరించేలా అధికారులు తగిన చొరవ చూపాలన్నారు. జీవిక సంఘం తాలూకా సంచాలకులు శ్రీనివాస్, తాలూకా పంచాయతీ ఈఓ మునిరాజ్, నగరసభ కమిషనర్ మంజునాథ్, పీ శ్రీనివాస్, నరసింహ, మునిరాజు, మునియప్ప, కృష్ణప్ప, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కబ్బన్‌పార్క్ రక్షణకై వినూత్న నిరసన



స్కేటింగ్ చేస్తూ వినూత్నంగా నిరసన

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కబ్బన్ పార్క్‌ను రక్షించాలని వినూత్నంగా నిరసన జరిపారు. పార్క్ ఆవరణలో ఆదివారం స్కేటింగ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కబ్బన్‌పార్క్‌లో వేలాది పక్షిజాతులు, సరీశృపాలు ఉన్నాయని వాటిని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. వాహనాలనుంచి కొంత మేరనైనా రక్షణ అవసరమన్నారు. కబ్బన్‌పార్క్ ప్రాంగణంలో కొత్తగా భవ నాలు నిర్మించరాదని డిమాండ్ చేశారు. కాగా ఇకపై ఒకటవ, మూడవ శని వారాలలో వాహనాల రాకపోకలను కట్టడి చేస్తున్నట్టు ఉద్యానవన అధికారులు ప్రకటించారు.

శబరిమలైకు బయల్దేరిన భక్తులు



శబరిమలైకు సిద్ధమైన అయ్యప్పభక్తులు

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 11: ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామంలో 50వ వార్షిక జయకుమార్ అయ్యప్పస్వామి భక్తమండలి ఆధ్వర్యంలో ఆదివారం భక్తబృందం శబరిమలైకు బయల్దేరింది. 49మంది భక్తులు ఇరుముడి ధరించారు. తొలుత కాశీవిశ్వనాథస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం ఇరుముడి ధారణ ప్రక్రియ సాగింది. ఈనెల 13న శబరిమలైలో దర్శనం ఉంటుం దన్నారు. గురుస్వామి చౌడప్ప మార్గదర్శకంలో మాలధారులు సంప్రదాయంగా ఇరుముడి ధరించారు. దొమ్మసంద్ర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు సీ రవీంద్ర, నాగరాజు, జగదీశ్, గురుప్రసాద్, మురుగేశ్‌లు భక్తులకు వీడ్కోలు పలికారు.